


తెలుగు దినపత్రిక
# వార్త నిర్భయం
సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com
ఎడిటర్ కాడేపాగు అశోక్
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 168 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజీలు : 04, వెల రూ. 4రూ/ శుక్రవారం- 15 - మే - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

### రాహుల్ గాంధీ ఆదాయం, విదేశీ పర్యటనల ఖర్చుల్లో
# వ్యత్యాసం ఉందన్న బీజేపీ
## ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్

- గత 22 ఏళ్లలో రాహుల్ గాంధీ 54 విదేశీ ట్రిప్పులు
- ఈ పర్యటనల మొత్తం ఖర్చు రూ.60 కోట్లు- ఆస్తుల విలువ రూ. 20.39 కోట్లే
- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర



ఢిల్లి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర సంచలన ఆరోపణలు చేశారు. రాహుల్‌కు ఏటా వచ్చే వార్షిక ఆదాయాలకు, ఆయన విదేశీ పర్యటనలకు చేస్తున్న ఖర్చులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందన్నారు. ఫారిన్ పర్యటనల్లో ఖర్చు చేస్తున్న నిధుల మూలాలను రాహుల్ వెల్లడించాలని సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ గత 22 ఏళ్లలో 54 విదేశీ ట్రిప్పులకు వెళ్లారని, వాటి మొత్తం ఖర్చు రూ.60 కోట్ల దాకా అయిందన్నారు. మిగతా..2లో

### శబరిమల కేసులో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు
### మే 29లోపు లిఖితపూర్వక వాదనలకు అనుమతి



- అయ్యప్ప ఆలయంలో మహిళలపై వివక్ష అంశంపై ముగిసిన వాదనలు
- మే 29లోపు లిఖితపూర్వక వాదనలు సమర్పించవచ్చన్న సుప్రీంకోర్టు

ఢిల్లి: శబరిమల ఆలయంతో సహా వివిధ మతపరమైన ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్ష, మతస్వేచ్ఛపై దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు వాయిదావేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును 16రోజులపాటు విచారణ జరిపింది.

# ఈదురుగాలి బీభత్సం

- గాలిలో 300 మీటర్ల దూరం ఎగిరిపడిన వ్యక్తి
- దెబ్బతిన్న పలు ఇళ్లు, వాహనాలు
- పరిస్థితులపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరా



ఢిల్లి : ఉత్తర్ ప్రదేశ్ లో మండువేసవిలో తీవ్ర గాలి దుమారం, భారీ వర్షం పెనుబీభత్సం సృష్టించింది. ఈ క్రమంలోనే బరేలీ జిల్లాలో బలమైన ఈదురు గాలుల కారణంగా ఓ వ్యక్తి 300మీటర్లు దూరం ఎగిరిపడ్డాడు. గాలిదుమారం రావడంతో ఆ వ్యక్తి ఓ షెడ్డును పట్టుకుని నిలబడ్డాడు. అయితే గాలి తీవ్రతకు షెడ్డుతో సహా 50 అడుగుల ఎత్తులోకి ఎగిరి పొలంలో పడ్డాడు. ఈ ప్రమాదంలో బాధితుడికి గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని బమియానా గ్రామానికి చెందిన నన్హే మియాన్ గా గుర్తించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. "గాలి చాలా బలంగా వీచడంతో రేకుల షెడ్డు పెద్ద శబ్దాలు చేయడం ప్రారంభించింది. నేను దానిని పట్టుకోకపోతే అది తుఫానుకు కొట్టుకుపోతుందని అనుకున్నాను. అందుకే వెంటనే షెడ్డుకు కట్టిన తాడును పట్టుకున్నాను. కానీ, అప్పుడు చాలా బలమైన గాలుల తాకిడికి షెడ్డుతో సహా నన్ను, మరో ఇద్దరినీ గాలిలోకి తీసుకెళ్లింది. ఆ తర్వాత గాలి తీవ్రత కాస్త తగ్గి కింద పడే ముందు నన్ను దాదాపు 50 అడుగుల ఎత్తుకు తీసుకువెళ్లింది." అని బాధితుడు నాన్హె చెప్పాడు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మిగతా..2లో

### కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ కీలక భేటీ..



- మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు.
- నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు.

హైదరాబాద్, మే14: మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు.

## కేరళం సీఎం వీడీ సతీశన్‌కు రేవంత్‌రెడ్డి
# అభినందనలు

- కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.
- కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ...
- విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు.



హైదరాబాద్, మే 14 : కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మిగతా..2లో

### ధాన్యం కొనుగోళ్లలో
# సమస్యలు పరిష్కరిస్తాం



రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు.

ఖమ్మం జిల్లా, మే 14 : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. ఈరోజు(గురువారం) కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిగతా..2లో

### మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు కార్యరూపం - రూ.2,816 కోట్లతో పట్టాలెక్కనున్న ప్రాజెక్టు



- మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్ త్వరలోనే ప్రారంభం
- ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం త్వరలోనే ఊపనున్న పచ్చజండా
- రైల్వే లైన్ మచిలీపట్నాన్ని రేపల్లెతో కలుపుతూ 47.60 కిలోమీటర్ల దూరం మేర

అమరావతి : మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్ త్వరలోనే ఒక రూపు సంతరించుకోనుంది. సుమారు రూ.2,816 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైల్వే బోర్డు ఆమోదం తెలిపిన అనంతరం, 'తుది స్థాన నిర్ధారణ సర్వే' పూర్తయింది. అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ సర్వే పనులు పూర్తి కావడానికి ఏడాదిన్నర సమయం పట్టింది. మిగతా..2లో

# నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన



- పేపర్ లీక్ తో నీట్ పరీక్ష రద్దు
- పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి
- పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య

హైదరాబాద్: నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై మిగతా..2లో

### రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'...
### ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఏపీలో నవ శకం



- రాయలసీమను డి హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వ భారీ అడుగులు
- పుట్టపర్తిలో రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు
- డ్రోన్, డిఫెన్స్ రంగాల్లో మరో 12 కంపెనీల ప్రాజెక్టులకు శ్రీకారం
- వేల కోట్ల పెట్టుబడులతో పాటు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు

### వారానికి ఒకరోజు నో వెహికల్ డే - ప్రధాని పొదుపు చర్యలపై
# కేబినెట్ భేటీలో కీలక చర్చ



- సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- దాదాపు 40కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలపిన మంత్రివర్గం
- ప్రధాని మోదీ పొదుపు పిలుపు చర్యలపై ప్రత్యేకంగా చర్చ

అమరావతి : ప్రధాని మోదీ పొదుపు చర్యల పిలుపుపై ఈ రోజు సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. దాదాపు నాలుగు గంటలు జరిగిన ఈ సమావేశంలో 40కిపైగా అజెండా అంశాలపై చర్చించారు. ఇప్పటికే తమ కాన్వాయ్ వాహనాలు తగ్గించాలని భద్రత సిబ్బందికి ఇప్పటికే చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ సహా మంత్రులు ఆదేశాలు ఇవ్వగా అధికారులు, ఆ దిశగా చర్యలు తీసుకుని కాన్వాయ్ ని తగ్గించారు. అలానే కాన్వాయ్‌లు తగ్గించుకుంటే సరిపోదని ఇతర మార్గాలు చూడాలని ఇంక ప్రజలు బంగారం కొనుగోళ్లు తగ్గించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం కల్పించే కీలక అంశంపై చర్చించారు. భారీ పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, శుద్ధ ఇంధన ప్రాజెక్టులు, మౌలిక వసతుల విస్తరణపై మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. డేటా సెంటర్లు, ఆటోమొబైల్, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులకు మిగతా..2లో

### ఏపీ కేబినెట్‌లో పొదుపు విప్లవం..
### ఎస్కార్ట్ లేకుండా ఒకే వాహనంలో మంత్రులు



- ఆర్భాటాలను పక్కన పెట్టిన ఏపీ మంత్రులు
- లోకేశ్ ఏర్పాటు చేసిన విందుకు కాన్వాయ్ లేకుండా ఒకే వాహనంలో వచ్చిన మంత్రులు
- రెండు వాహనాలతో సీఎం క్యాంపు కార్యాలయానికి మంత్రి నారాయణ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 'పొదుపు మంత్రం' అమలవుతున్న తీరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అంతర్జాతీయ చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుకు స్పందిస్తూ, ఏపీ మంత్రులు తమ విలాసాలను పక్కనపెట్టి సామాన్యుల తరహాలో పొదుపు చర్యలు చేపట్టడం ఒక గొప్ప ముందడుగు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఇప్పటికే మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఏపీ కేబినెట్‌లో పొదుపు విప్లవం.. ఎస్కార్ట్ లేకుండా ఒకే వాహనంలో మంత్రులు

తమ భద్రత, కాన్వాయ్ విషయంలో పొదుపు పాటిస్తుండగా... ఇతర మంత్రులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. ఈ ఉదయం సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, కొల్లు రవీంద్ర, పార్థసారథి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, పయ్యావుల కేశవ్ తదితరులు ఎస్కార్ట్ వాహనాలను పక్కనపెట్టి, కేవలం ఒక్కో వాహనంలోనే సీఎం కార్యాలయానికి చేరుకున్నారు. గతంలో మంత్రి నారాయణ కాన్వాయ్‌లో తన సొంత వాహనంతో పాటు మరో నాలుగు వాహనాలు ఉండేవి. ఇప్పుడు ఆ కాన్వాయ్‌లో ఏకంగా 50 శాతం తగ్గించుకుంటూ నారాయణ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం రెండు వాహనాలతోనే ఆయన నేడు సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు.

## కేరళం సీఎం వీడీ సతీశన్‌కు రేవంత్‌రెడ్డి అభినందనలు

సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం

పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

## కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ కీలక భేటీ..

నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## శబరిమల కేసులో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు మే 29లోపు లిఖితపూర్వక వాదనలకు అనుమతి

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, అభిషేక్ సింఘ్వి, ముకుల్ రోహత్గీ, ఇందిరా జైసింగ్‌ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. విచారణకు ముందు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం వయస్సున్న మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సమర్థించాలని కేంద్రం లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినది అయినందున న్యాయసమీక్ష పరిధిలోకి రాదని పేర్కొంది. 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. 2019 నవంబర్‌లో అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ వివాదంతోపాటు ఇతర మతాల్లోని మహిళలపై వివక్ష అంశాలను 9మంది సభ్యులతో కూడిన ధర్మాసనానికి బదిలీ చేసింది.

## నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన

ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ- మే 30 నుంచే అమలు

ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో

మూడో దశ ఎస్ ఐఆర్ మే 30 నుంచి దశలవారీగా చేపట్టనున్న ప్రక్రియ




ఢిల్లి : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐఆర్ )మూడో దశకు సంబంధించి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 30 నుంచి దశలవారీగా చేపట్టనున్నట్లు గురువారం తెలిపింది. ఢిల్లీ, ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రానగర్ హవేలి, డామన్ డయ్యూలో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ జరగనుంది. అయితే, మంచు ప్రభావిత ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్ , జమ్ము కశ్మీర్ , లద్దాఖ్ ప్రాంతాల్లో వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. మూడో దశలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాల పరిశీలన ఎస్ ఐఆర్ మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు లు ఇంటింటికీ వెళ్లి దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. వీరికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు లు సహకరించనున్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా దీూాలను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది. మరోవైపు, మూడో దశ షెడ్యూల్‌ను రాష్ట్రాల వారీగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్ ప్రాంతాల్లో జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్ ఓలు ఇంటింటిటి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. అనంతరం జులై 21న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల చేయనున్నారు.

### తెలంగాణ విషయానికొస్తే!

ఇక, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25 నుంచి జులై 24 వరకు దీూాలు ఇంటింటికీ వెళ్లనున్నారు. జులై 31న ముసాయిదా జాబితా విడుదల చేసి, అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, దిల్లీ, ఝార్ఖండ్, మేఘాలయ రాష్ట్రాల్లో జూన్ 30 నుంచి జులై 29 వరకు పరిశీలన కొనసాగుతుంది. అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. అలాగే, నాగాలాండ్‌లో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు పరిశీలన ఉండగా, నవంబర్ 22న తుది జాబితా విడుదల చేస్తారు. త్రిపురలో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 14 వరకు ఇంటింటి పరిశీలన జరగనుంది. డిసెంబర్ 23న తుది జాబితా విడుదల చేయనున్నారు. ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాల్లో జూన్ 28 వరకు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. జులై 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 4 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం తుది జాబితా సెప్టెంబర్ 6న విడుదల కానుంది. అదేవిధంగా, దాద్రా నగర్ హవేలీ, దామన్ అండ్ డయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల్లో జూన్ 4 నుంచి జూలై 3 వరకు బీఎల్ ఓలు ఇంటింటిటిక వెళ్లి పరిశీలించున్నారు. అనంతరం ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 11న ప్రకటించనున్నారు. ఉత్తరాఖండ్‌లో జూన్ 8 నుంచి జులై 7 వరకు దీూాల పరిశీలన జరిగి, సెప్టెంబర్ 15న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

### ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కంప్లీట్!

కాగా, బిహార్, బంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఇప్పటివరకు జరిగిన తొలి రెండు దశల్లో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 59 కోట్లకు పైగా ఓటర్ల వివరాలను సేకరించినట్లు ఈసీ పేర్కొంది. ఆ దశల్లో 6.3 లక్షల బీఎల్ఓలు, 9.2 లక్షల బీఎల్ ఏలు పాల్గొన్నట్లు వెల్లడించింది.

## వారానికి ఒకరోజు నో వెహికల్ డే - ప్రధాని పొదుపు చర్యలపై కేబినెట్ భేటీలో కీలక చర్చ

మొదటి పేజి తరువాయి

కేబినెట్ ఆమోదం తెలిపింది. కీలక ప్రాజెక్టులకు కేబినెట్ పచ్చజెండా: తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిళ్ల తయారీ యూనిట్, విశాఖలో 1 లక్ష కోట్ల రూపాయలతో రిలయన్స్ డేటా సెంటర్ ఏర్పాటు, సత్యసాయి జిల్లాలో 51 వేల కోట్ల రూపాయలతో సోలార్ పవర్ ప్లాంట్, కడపలో 12 వేల కోట్ల రూపాయలతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ వంటి కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. 39 వేల ఉద్యోగాల కల్పనకు సంబంధించిన కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పీపీపీ మోడల్‌లో కర్నూలు విమానాశ్రయం అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చించారు. వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపైనా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఎంఎస్ ఎంఈలకు నిధుల సౌలభ్యం కల్పించేందుకు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ ఏర్పాటు ప్రతిపాదనపై కేబినెట్ చర్చించింది. విద్యుత్ సంస్థల్లో ఇంజినీరింగ్ పోస్టుల భర్తీ, అగ్రిగోల్డ్ కేసులపై ప్రత్యేక బృందం నియామకం వంటి అంశాలపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సాగునీటి కాలువల విస్తరణ, రహదారులు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించింది. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్, బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు మంత్రివర్గం అనుమతులు ఇచ్చింది. శుద్ధ ఇంధన రంగంలో రాష్ట్రాన్ని ముందంజలో నిలబెట్టేలా చర్యలు తీసుకోనుంది. కృతజ్ఞత చాటే సమయం వచ్చింది: నాదేశం - నా బాధ్యత పేరుతో పొదుపుపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రివర్గంలో సీఎం చంద్రబాబు నిర్ణయించారు. మంత్రులు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని సూచించారు. వర్చువల్ విధానానికి



ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా పర్యటనలలోనూ మంత్రులు కాస్ట్ కటింగ్ పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల టెంపరేచర్‌ను 24 నుంచి 26 మధ్య నడపాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలని సూచించారు. దేశాన్ని కాపాడేందుకు పొదుపు చర్యలు పెద్ద ఎత్తున పాటిద్దామని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే ప్రక్రియ మన దగ్గర నుంచే ప్రారంభిద్దామన్నారు. దేశం మనకెంతో ఇచ్చిందని ఆ కృతజ్ఞత చాటే సమయంగా ప్రస్తుత పరిస్థితిని చూడాలని వ్యాఖ్యానించారు. సమయం తీసుకుని ప్రకటన చేద్దాం: పొదుపు చర్యలు ఒక్కసారిగా ప్రజల్ని భయపెట్టేవిధంగా కాకుండా దశల వారీగా చేపడదామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. పవన్ సూచనలకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ప్రతీ నిర్ణయానికి 48గంటల ముందు ప్రజల్ని సన్నద్ధం చేసి సమయం తీసుకుని ప్రకటన చేద్దామని సీఎం అన్నారు. తమ తమ శాఖల పరిధిలో పొదుపు చర్యలు, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలపై అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించాలని కార్యదర్శులకు ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ డెవలప్ మెంట్ ప్లాన్ కింద లక్ష కోట్ల ఖర్చు ప్రణాళికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అగ్రిగోల్డ్ బాధితులకు 6 నెలల్లో న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్క ఏపీ లోనే 11.5 లక్షలకుపైగా బాధితులు ఉంటే 8 రాష్ట్రాల్లో దాదాపు 20 లక్షల మంది బాధితులు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వంలో సీఐడీ పెద్దలు సైతం అగ్రిగోల్డ్ సొమ్ము తిన్నారని చంద్రబాబు మండిపడ్డారు. సైకిళ్ల వాడకం పెంచాలి: భేటీ అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ సూర్య ఘర్ కనెక్షన్లు పెంచాలని సీఎం ఆదేశించారని తెలిపారు. కాలుష్యకారక వాహనాలు వీలైనంత తగ్గించాలని సీఎం కోరారని పంటలకు ఎరువులు, రసాయనాల వినియోగం తగ్గించాలని చెప్పారని అన్నారు. సైకిళ్ల వాడకం పెంచాలని, పాదయాత్రగా వెళ్లాలని ఇంక ఈవీ వాహనాలు వాడేవారిని ప్రోత్సహించాలని సీఎం చెప్పినట్లు మంత్రి వెల్లడించారు యూనివర్సిటీలు ఆన్‌లైన్ తరగతులు పెంచాలని ప్రభుత్వ సంస్థల్లోనూ వర్క్ ఫ్రమ్ హోంను పరిశీలించాలని చెప్పినట్లు పార్థసారథి వివరించారు. "ఇంధనం విషయంలో తొలుత దేశం గురించి ఆలోచించాలి. పొదుపు చర్యలతో ఆదాయం తగ్గినా భరించేందుకు సిద్ధం. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజారవాణాను ప్రోత్సహించాలి. ప్రజాప్రతినిధులు తమ వాహనాలు తగ్గించుకోవాలి. వారానికి ఒకరోజు నో వెహికల్ డేగా పాటించాలి. ఇంధన వినియోగం తగ్గించుకోవాలని ఆర్టీసీని కోరాం. నేతలు, అధికారులు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని కోరాం. బంగారం కొనుగోళ్లు తగ్గించాలని సీఎం కోరారు. బంగారం కొనడం తగ్గిస్తే విదేశీమారక ద్రవ్యం పెంచుకోవచ్చు.'

## మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు కార్యరూపం - రూ.2,816 కోట్లతో పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం త్వరలోనే పచ్చజెండా ఊపనుందని భావిస్తున్నారు. దీనితో దివిసీమ మచిలీపట్నం ప్రజల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరే తరుణం ఎట్టకేలకు ఆసన్నమైంది. ఈ పనులను ప్రారంభించాలని కోరుతూ ఎంపీ బాలశౌరి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్ర అధికారులను పార్లమెంటు లోపల, వెలుపల అనేక సందర్భాల్లో పదేపదే కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన చేసిన నిరంతర కృషి ఇప్పుడు ఫలితాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. 47 కి.మీ 6 స్టేషన్లు : ఈ రైల్వే లైన్ మచిలీపట్నాన్ని రేపల్లెతో కలుపుతూ 47.60 కిలోమీటర్ల దూరం మేర విస్తరించి ఉంటుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 70 వంతెనలు, 24 అండర్‌బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మార్గంలో పెనుమూడి, అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి, మజేరు, రుద్రవరం అనే ఆరు రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. బందరు పోర్టుకు అత్యంత కీలకం : మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తి కాకముందే ఈ కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే, సరుకు రవాణాకు ఇది ఒక కీలకమైన వనరుగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా విజయవాడ రైల్వే జంక్షన్‌పై ఉన్న ట్రాఫిక్ భారాన్ని తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. కోల్‌కతా - చెన్నై మధ్య రాకపోకలు సాగించే రైళ్లు విజయవాడను దాటవేసి దానికి బదులుగా మచిలీపట్నం మీదుగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రయాణ దూరం 55 కిలోమీటర్లు తగ్గుతుంది. తత్ఫలితంగా ప్రయాణ సమయం సరుకు రవాణా ఖర్చులు రెండూ తగ్గుతాయి. ఈ మార్గం తీరప్రాంతానికి ఒక కీలకమైన జీవనాడిగా ఆవిర్భవించనుంది.

### రైల్వే బోర్డు ఆమోదం :

"మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్‌కు సంబంధించిన 'తుది స్థాన నిర్ధారణ సర్వే' పూర్తయింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'వివరాల ప్రాజెక్టు నివేదిక'కు రైల్వే బోర్డు తన ఆమోదాన్ని తెలిపింది. మంత్రివర్గ



ఆమోదం అతి త్వరలో లభించనుండగా, తద్వారా పనుల ప్రారంభానికి మార్గం సుగమమవుతుంది. రైల్వే శాఖ సర్వే మార్గ పటాన్ని తన "ఘూాూాూ' వ్యవస్థలో అధికారికంగా అప్‌లోడ్ చేసింది. ఈ కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం సాధించడంలో సహకరించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైల్వే అధికారులకు కృతజ్ఞతలు".

## రాయలసీమ ఇకపై 'రక్షణ సీమ'... ఏఎంసీఏ ప్రాజెక్టుతో ఏపీలో నవ శకం

మొదటి పేజి తరువాయి

అమరావతి : ఒకప్పుడు రత్నాలకు, ఆ తర్వాత ఉద్యాన పంటలకు నెలవైన రాయలసీమ, ఇప్పుడు దేశ రక్షణ రంగంలో కీలక భూమిక పోషించేందుకు సిద్ధమవుతోంది. స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి కేంద్రంగా నిలవనుంది. 'రతనాల సీమ'గా చరిత్రలో, 'ఉద్యాన సీమ'గా వర్తమానంలో నిలిచిన ఈ ప్రాంతం, భవిష్యత్తులో 'రక్షణ సీమ'గా సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో రక్షణ, డ్రోన్ రంగాల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు రాయలసీమ వేదిక కానుంది. ఇందులో భాగంగా, శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఏఎంసీఏ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది

### పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు భూమిపూజ

దేశ రక్షణ వ్యవస్థలో గేమ్ ఛేంజర్‌గా భావిస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు పుట్టపర్తిలో పునాది రాయి పడనుంది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ), డీఆర్‌డీఓ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. సుమారు రూ.15,803 కోట్ల భారీ బడ్జెట్‌తో, 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ప్రాజెక్టులో భాగంగా,



భారతదేశపు మొట్టమొదటి 5వ తరం స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను అభివృద్ధి చేస్తారు. స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్, సూపర్ క్రూయిజ్ వంటి అత్యాధునిక సామర్థ్యాలు ఈ యుద్ధ విమానాల ప్రత్యేకత. కేవలం తయారీనే కాకుండా, వాటి టెస్టింగ్ కూడా పుట్టపర్తిలోనే చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 7,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికి అనుబంధంగా వచ్చే ఇతర పరిశ్రమల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని, దీనికోసం ప్రభుత్వం మరో 400 ఎకరాలు కేటాయించింది.

### డ్రోన్ సిటీ, ఇతర ప్రాజెక్టులతో సమగ్ర అభివృద్ధి

పుట్టపర్తి ప్రాజెక్టుతో పాటు, కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' ద్వారా దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలో రక్షణ, డ్రోన్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు మరో 12 ప్రాజెక్టులకు కూడా శుక్రవారం శంకుస్థాపన జరగనుంది. వీటిలో 4 డిఫెన్స్ ప్రాజెక్టులు కాగా, 8 డ్రోన్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా అదనంగా రూ.4,145 కోట్ల పెట్టుబడులు, 6,071 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మరో 12 ప్రాజెక్టుల వివరాలు:

కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్: రూ.1430 కోట్ల పెట్టుబడి, 565 మందికి ఉపాధి భారత్ డైనమిక్స్ లిమిటెడ్: రూ.489 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉపాధి హెచ్ఎఫ్ సీఎల్: రూ.1040 కోట్ల పెట్టుబడి, 870 మందికి ఉపాధి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్: రూ.500 కోట్ల పెట్టుబడి, 2050 మందికి ఉపాధి అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.34 కోట్ల పెట్టుబడి, 52 మందికి ఉపాధి డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.255 కోట్ల పెట్టుబడి, 850 మందికి ఉపాధి డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్: రూ.5 కోట్ల పెట్టుబడి, 14 మందికి ఉపాధి హెచ్ సి రోబోటిక్స్: రూ.100 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉపాధి సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్: రూ.68 కోట్ల పెట్టుబడి, 45 మందికి ఉపాధి ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్: రూ.100 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉపాధి జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్: రూ.114 కోట్ల పెట్టుబడి, 350 మందికి ఉపాధి లాట్రిక్ ఎయిరో స్పేస్: రూ.10 కోట్ల పెట్టుబడి, 125 మందికి ఉపాధి

## రాహుల్ గాంధీ ఆదాయం, విదేశీ పర్యటనల ఖర్చుల్లో వ్యత్యాసం ఉందన్న బీజేపీ

మొదటి పేజి తరువాయి



కానీ కాంగ్రెస్ అగ్రనేత గత పదేళ్లలో ఫైల్ చేసిన ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన వార్షిక ఆదాయాలన్నీ కలుపుకున్నా రూ.11 కోట్లకు మించి ఉండవని సంబిత్ పాత్ర తెలిపారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ మండిపడ్డారు. మోదీ సర్కారు వైఫల్యాల నుంచి ప్రజల చూపును మళ్లించడానికి, కేంద్ర మంత్రి పదవి కోసమే సంబిత్ పాత్ర ఇలాంటి ఆరోపణలు చేశారని విమర్శించారు.

రూ. 20.39 కోట్ల ఆస్తులకు, రూ. 60 కోట్ల ఖర్చులకు పొంతనేది?

"రాహుల్ గాంధీ ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 2004లో ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ. 55.38 లక్షలు. 2024 నాటికి మొత్తం ఆస్తుల విలువ రూ. 20.39 కోట్లకు పెరిగింది. అంటే గత 22 ఏళ్లలో (2004 నుంచి 2026 వరకు) ఆస్తుల విలువ రూ. 55.38 లక్షల నుంచి రూ. 20.39 కోట్లకు చేరింది. సరిగ్గా ఇదే 22 ఏళ్ల వ్యవధిలో రాహుల్ గాంధీ 54 విదేశీ పర్యటనలకు దాదాపు రూ. 60 కోట్లను ఖర్చు చేశారు. రూ. 20.39 కోట్ల ఆస్తులకు, రూ. 60 కోట్ల విదేశీ పర్యటనల ఖర్చులకు లెక్క సరిపోవడం లేదు. ఈ విదేశీ పర్యటనలకు ఎవరు నిధులను సమకూర్చారో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వెల్లడించాలి" అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు.

### 'రహస్య పర్యటనలపై వివరణ ఇవ్వాలి'

"రాహుల్ గాంధీ తన అనేక విదేశీ పర్యటనల వివరాలను వెల్లడించలేదు. ఈ రహస్య పర్యటనలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ అగ్రనేతకు ఉంది. ఇది చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల ప్రకారం ఏ ఎంపీ, న్యాయమూర్తి లేదా ప్రభుత్వ అధికారి విదేశీ పర్యటనలకు ఏదైనా ఏజెన్సీ నిధులను సమకూరిస్తే ప్రభుత్వం, హోం వ్యవహారాల శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఒకవేళ వ్యక్తిగత ఖర్చుతో ఏదైనా విదేశీ పర్యటనకు వెళితే, దాన్ని ఆదాయపు పన్ను రిటర్న్‌లో వెల్లడించాలి. మీరు విదేశాల్లో ఏదైనా బహుమతి అందుకున్నా లేదా మీపై వెల్లడి చేయని విధంగా డబ్బును ఖర్చు చేసినా, అది బ్లాక్ మనీ యాక్ట్ 2015 నిబంధనల పరిధిలోకి వస్తుంది. రాహుల్ తన విదేశీ పర్యటనల కోసం హోం శాఖ నుంచి ముందస్తు అనుమతిని పొందారా? ఆ పత్రాలు ఎక్కడ ఉన్నాయి? ఆయన ఆదాయపు పన్ను వివరాలను వెల్లడించారా?" అని సంబిత్ పాత్ర ప్రశ్నలు సంధించారు.

### 'మస్కట్ పర్యటన దృశ్యాలను అందించాలి'

"2025 సెప్టెంబరులో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఆర్పీఎఫ్ ఒక లేఖ రాసింది. 2024 డిసెంబరు నుంచి 2025 సెప్టెంబరు మధ్య కాలంలో రాహుల్ గాంధీ చేసిన ఆరు అప్రకటిత విదేశీ పర్యటనలపై సీఆర్పీఎఫ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ పర్యటనలన్నీ ఎస్పీజీ రక్షణకు సంబంధించిన ఎల్లో బుక్ నిబంధనలను ఉల్లంఘించి జరిగాయి. అందువల్ల ఇది అత్యంత ఆందోళనకరమైన అంశమని లేఖలో సీఆర్పీఎఫ్ పేర్కొంది. 2026 మే 3న రాత్రి ఒమన్‌లోని మస్కట్‌లో రాహుల్ చేసిన వ్యక్తిగత పర్యటనకు సంబంధించిన దృశ్యాలను అందించాలని మేం కోరుతున్నాం. మస్కట్‌లో తనకు ఆతిథ్యం ఇచ్చిన వారి వివరాలను కానీ, పర్యటన ప్రణాళికను కానీ కాంగ్రెస్ అగ్రనేత వెల్లడించలేదు. ఇంతకీ ఆయనను అక్కడికి ఎవరు ఆహ్వానించారు? ఎఫ్‌సీఆర్ఏ సెక్షన్ 6 కింద ఎలాంటి అనుమతినీ తీసుకోకుండా చేసిన పర్యటన అది" అని సంబిత్ పాత్ర వెల్లడించారు.

## ఈదురుగాలి బీభత్సం

మొదటి పేజి తరువాయి

ఈ ఘటన వీడియోలోనూ ఆ వ్యక్తి రేకుల షెడ్డును పట్టుకుని గాలిలోకి ఎగిరిపోవడం కనిపిస్తుంది. మొదట్లో కొంతమంది నెటిజన్లు ఈ వీడియోపై అనుమానం వ్యక్తం చేశారు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి సృష్టించిందని అన్నారు.

### ఒక్క రోజులోనే 89 మంది మృతి

ఇదిలా ఉండగా, యూపీలోని పలు జిల్లాల్లో తలెత్తిన ప్రకృతి వైపరీత్యానికి బుధవారం ఒక్కరోజే 89 మంది మరణించారు. వందల మందికి గాయాలయ్యాయి. ప్రయాగ్‌రాజ్ జిల్లాలో అత్యధికంగా 21 మంది మృతి చెందారు. భదోహిలో 16 మంది మరణించారు. ఫతేపూర్, ప్రతాప్‌గఢ్, బదౌన్, కుశీనగర్, సోన్‌భద్ర ప్రాంతాల్లో మిగిలిన వారు బలయ్యారు. గాలివాన బీభత్సానికి ఆయా ప్రాంతాల్లో భారీ ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. పలు ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి.

### ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరా

మరోవైపు ఈ అకాల వర్షాల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణనష్టంపై రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరాతీశారు. నష్టంపై సమీక్షించిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, మృతుల కుటుంబాలకు 24 గంటల్లోపు ఆర్థిక సాయం అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని, వర్ష ప్రభావిత జిల్లాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. "గాలి దుమారం, వడగళ్ల వాన, పిడుగుల కారణంగా మే 13న పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ఫలితంగా వేర్వేరు వర్ష సంబంధిత ఘటనల్లో 89 మంది మృతి చెందారు. మరో 53 మంది గాయపడగా, 114 జంతువులు మరణించాయి. 87 ఇళ్లు ధ్వంసమయ్యాయి" అని ఉత్తర్ ప్రదేశ్ రిలీఫ్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది.

### పెనుగాలితో పాటు పిడుగులు

సాధారణంగా మే నెలలో ఉత్తర భారతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. చాలాచోట్ల సగటు ఉష్ణోగ్రత 40 డిగ్రీల పైనే ఉంటుంది. ఆ సమయంలో భూఉపరితలంపై ఉండే గాలి విపరీతంగా వేడెక్కుతుంది. అది వేగంగా కదులుతూ ఇతర దిశల నుంచి తడిగాలిని లాగేసుకుంటుంది. ఫలితంగా ఈ రెండు కలిసి ఆకాశంలో చాలా ఎత్తుకు చేరినప్పుడు క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. దట్టమైన నల్లటి మబ్బులు ఆకాశమంతా విస్తరిస్తాయి. ఆ తర్వాత తక్కువ సమయంలోనే భారీ వర్షం, వడగళ్లు, పిడుగులు బీభత్సం సృష్టిస్తాయి. తాజాగా యూపీలో కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# హనుమకొండ: యువతిని వేధించిన 8 మంది యువకులపై కేసు



హనుమకొండ ప్రతినిధి మే 14 ( వార్త నిర్భయం ) హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన ఓ యువతిని వేధించిన ఘటనలో 8 మంది యువకులపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఈవ్ టీజింగ్ కేసు నమోదు చేశారు.నిందితుల వివరాలు: తోటపల్లి వేణు శంకర్, నరాల రాజేశ్, మినుగు అజేయ్, నరాల దినేశ్, ముంతా నితిన్, ముంతా చరణ్, తుర్క మణికంఠ, పునుగంటి సందీప్‌లుగా గుర్తించారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్ల వయసు వారేనని పోలీసులు తెలిపారు.ఘటన వివరాలు గోపాల్‌పూర్ ప్రాంతంలో యువతిని కొంతకాలంగా ఈ యువకులు వెంబడించి అసభ్యకరంగా మాట్లాడటం, వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో కేయూ సీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల హెచ్చరిక మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని, బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సీఐ రవి కుమార్ సూచించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

# టీపీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన బండి రమేష్.

### మర్యాదపూర్వక భేటీలో కృతజ్ఞతలు తెలిపిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్.

### పేదల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన.



హైదరాబాద్, మే 14 (వార్త నిర్భయం) టీపీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ గురువారం టీపీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.పూల బొకే ఇచ్చి శాలువా కప్పి రమేష్ గారు మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానించారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు పార్టీ తరఫున మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కార్పొరేషన్ ద్వారా కమ్మ కులంలోని పేదలకు సహాయ సహకారాలు అందించి రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని బండి రమేష్‌కు సూచించారు.పార్టీ బలోపేతానికి, సామాజిక వర్గాల సంక్షేమానికి సమన్వయంతో చేయాలని ఆయన కోరారు.

# మాజీ మంత్రి పథకాలకే ప్రారంభోత్సవాలు.

### కొత్త పథకాలు తేవడంలో ఎమ్మెల్యే, మంత్రి విఫలం అయ్యారని ఆరోపణ.

### అభివృద్ధి పనులు  నిలిచిపోయాయి.

### వాకిటి శ్రీధర్ విమర్శలు.

వనపర్తి బ్యూరో, మే 14 (వార్త నిర్భయం) నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మంత్రి అభివృద్ధి పనులపై  జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన మేధస్సుతో సాధించిన శాశ్వత పథకాలకు నిధులు తెచ్చి పూర్తి చేయించారని, ఈరోజు ఎంతో ఆర్భాటంగా మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించిన డిజిటల్ జిల్లా గ్రంథాలయం కూడా ఆయన కృషి ఫలితమేనని గుర్తించాలని అన్నారు.ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క కొత్త అభివృద్ధి పథకం కూడా తీసుకురాలేదని, పత్రికా ప్రకటనల్లో మాత్రం వేల కోట్ల లెక్కలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని వాకిటి శ్రీధర్ ఆరోపించారు.కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ సముదాయాన్ని ఉద్దేశించిన లక్ష్యసాధనకు అసమర్థత ప్రస్తుత ఎమ్మెల్యేదేనని విమర్శించారు. 90 శాతం పూర్తయిన రోడ్ల విస్తరణ పనుల్లో మిగిలిన 10 శాతం పూర్తి చేయడంలో కూడా పాలకులు విఫలమయ్యారని దుయ్యబట్టారు.ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల విషయంలో అరకొర ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తప్ప ఒక్క కొత్త సంక్షేమ పథకం కూడా అమలు కాలేదని అన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలు, 11 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సాధించిన



పథకాలకు ప్రారంభోత్సవాలు చేయడం మాని కొత్త పథకాలు తీసుకువచ్చి చూపాలని డిమాండ్ చేశారు.రైతులు ధాన్యం కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తుంటే, రైతులను పట్టించుకోకుండా హంగామా చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని వాకిటి శ్రీధర్ హెచ్చరించారు.

# విద్య బానిసత్వం నుంచి విముక్తి కల్పిస్తుంది.

### బీసీ గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

### బంజారాహిల్స్ కొమురంభీం భవన్‌లో ఘనంగా కార్యక్రమం.

### తెలంగాణ రైజింగ్‌లో ప్రతి విద్యార్థి భాగం కావాలి'

### మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి.

హైదరాబాద్, మే 14 (వార్త నిర్భయం) బంజారాహిల్స్ కొమురంభీం భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు.మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, “విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం” అంటే విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు.విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకు వస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలేలు చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ రైజింగ్‌లో ప్రతి విద్యార్థి భాగం కావాలని పిలుపునిచ్చారు.విద్య ఎవరి సొత్తు కాదని, సరస్వతి దేవికి రంగు, రూపు తేడా ఉండదన్నారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నందున 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు.అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలని, 100 సంవత్సరాలుగా చేయని కుల గణనను ప్రజా ప్రభుత్వం చేసిందని తెలిపారు. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది



టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామన్నారు.అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్థులు అవుతారని, రాజకీయాలు అనగానే ఒక ధోరణిని విడనాడాలన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలని, రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును మారుస్తాయని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని, ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

### ఈనెల 19న కరీమాబాద్‌లో ధర్నా:

### మరుపల్ల రవి.

వరంగల్ ప్రతినిధి మే14 (వార్త నిర్భయం) అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగం కారులకు 250 గజములు ఇంటి స్థలము ప్రతి నెలకు 25 వేల రూపాయల పెన్షన్స్ సౌకర్యం కల్పిస్తామని పేర్కొని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా ఈనెల 19న కరీమాబాద్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టుతామని వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమ కారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి అన్నారు.  కరీమాబాదులోని ఎస్కే గౌడ్ కళాభవన్లో తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో  మరుపల్ల రవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నేటి రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యమకారు లకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని ఆయన అన్నారు అసలు  ఉద్యమకారులు ఎవరో ఇంతవరకు ప్రభుత్వం గుర్తించలేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఉద్యమకారుల వివరాలను అడిగె వారె లెరు.  ఇంతవరకు ఏ ఒక్క దరఖాస్తును పరిశీలించలేదన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలము ప్రతినెల 25 వేల రూపాయల పెన్షన్ అమలు జరుపుటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగు చొరవ చూపాలని ఉద్యమంలో మరణించిన ఉద్యమకారుల కుటుంబంలో ఏ ఒక్కరికైనా పథకాలు వర్తించాలని ఉద్యమ సమయంలో కేసులు కానీ ఉద్యమకారులను పోలీస్ శాఖ ద్వారా గుర్తించి వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ మరుపల్ల రవి డిమాండ్ చేశారు



# నీట్ పేపర్ లీక్: “ఒకే దేశం -ఒకే మెరిట్” నినాదం ప్రశ్నార్థకంలో.

### 22 లక్షల విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో.

### కేంద్రీకృత పరీక్షా వ్యవస్థ, ఎన్‌టీఏ వైఫల్యంపై ప్రశ్నలు.




(కడేపాగు అశోక్, ఎడిటర్, వార్త నిర్భయం) విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్ పరీక్షాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. “ఒకే పరీక్ష–ఒకే దేశం–ఒకే మెరిట్” అంటూ కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసిన విధానం చివరకు 22 లక్షల మంది భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టింది. ఈ కుంభకోణంలో అత్యంత ఆందోళనకర అంశం పేపర్ లీక్ కంటే, దానిపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి.కేంద్రీకృత విధానాన్ని బలవంతంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేసిన సర్కార్, భద్రతా ప్రమాణాలు, పారదర్శకత, పరీక్షా నిర్వహణలో కనీస బాధ్యతను కూడా నిలబెట్టుకోలేక పోయింది. లీకేజీలపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారాహిత్యంగా విమర్శలు వస్తున్నాయి. ఘటన తర్వాత కూడా స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడం, దీన్ని సాధారణ వైఫల్యంగా చూపించడం, సమస్య తీవ్రతను తగ్గించి చూపే ప్రయత్నం చేయడం శోచనీయం. ఈ వ్యవహారంపై కేంద్ర విద్యామంత్రులు గానీ, ప్రధానిగానీ ఇప్పటివరకు స్పందించలేదు.సంవత్సరాల శ్రమ బూడిదలో పోసిన పన్నీరు:  వైద్య విద్యలో ప్రవేశం కోసం మే 3న జరిగిన నీట్ పరీక్ష వెనక విద్యార్థుల సంవత్సరాల శ్రమ దాగుంది. ఎన్నో నిద్రలేని రాత్రులు, వారిపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు, కుటుంబాల త్యాగాలు ఉన్నాయి. కానీ, ప్రశ్నపత్రాల లీకేజీ, అక్రమాల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పరీక్షా వ్యవస్థ పేపర్ లీక్ మాఫియాల చేతిలో బందీ అయితే ప్రభుత్వం ఏం చేస్తున్నదనేదే ఇక్కడ ప్రశ్న.గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు సాధారణ వార్తలుగా మారిపోయాయి. నీట్–యూజీ 2024లో బీహార్‌లో జరిగిన లీక్ కేసులో విద్యార్థులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాలు, అధికార యంత్రాంగంతో సంబంధాలున్న వ్యక్తులు అరెస్టయ్యారు. సీబీఐ దర్యాప్తులో అంతర్రాష్ట్ర ముఠాలు పనిచేసినట్లు బయటపడింది. తాజాగా రాజస్థాన్ ఘటనలో బీజేపీకి సంబంధించిన వ్యక్తిని నిందితుడిగా అరెస్టు చేశారు.ఎన్‌టీఏ వైఫల్యం, వికేంద్రీకరణ డిమాండ్  పరీక్షా నిర్వహణ ఎన్‌టీఏకు అప్పగించినప్పటి నుంచే పారదర్శకత, విశ్వసనీయతపై అనేక ఆరోపణలు ఎదుర్కొంటోంది. సాంకేతిక లోపాలు, ప్రశ్నాపత్రాల లీక్‌లు, మార్కుల గందరగోళం, గ్రేసు మార్కుల వివాదాలు పునరావృతమయ్యాయి.యూజీసీ–నెట్ 2024 పరీక్ష సమగ్రత దెబ్బతిన్నదనే పేరుతో రద్దు చేయడం ఎన్‌టీఏ వైఫల్యానికి అతిపెద్ద ఉదాహరణ. నీట్‌లో పేపర్ లీక్ ఆరోపణలు, అసాధారణంగా టాపర్లు పెరగడం, ఒకే కేంద్రం నుంచి పలువురికి పూర్తి మార్కులు రావడం దేశవ్యాప్తంగా అనుమానాలకు దారితీసింది. అందుకే ఎన్‌టీఏను రద్దుచేసి, పరీక్షల నిర్వహణను వికేంద్రీకరించాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు బలపడుతున్నాయి.సామాన్య విద్యార్థులదే నష్టం ఈ వ్యవహారంలో ప్రధానంగా నష్టపోయింది సాధారణ, మధ్య తరగతి, గ్రామీణ విద్యార్థులే. కోచింగ్ మాఫియాలు, డబ్బు ఆధారిత అవినీతి నెట్‌వర్కులు పరీక్షా వ్యవస్థను ఆక్రమిస్తున్నప్పటికీ వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది.రాజస్థాన్‌లో పరీక్షా నిర్వహణకు ఒకరోజు ముందే రూ.5 లక్షలు, గంటకు ముందు రూ.30 వేలకు ప్రశ్నపత్రాలను మాఫియా అమ్మకాలు చేసినట్టు విద్యార్థుల తల్లిదండ్రులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు.“మెరిట్” పేరుతో విద్యను కేంద్రీకరించిన పాలకులు, అదే మెరిట్‌ను ఇప్పుడు మార్కెట్ శక్తులకు, అవినీతి ముఠాలకు అప్పగించిన పరిస్థితి కనిపిస్తోంది. పరీక్షా వ్యవస్థపై విశ్వాసం పునరుద్ధరించాలంటే, కేంద్ర ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా పారదర్శక విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు, భద్రతా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**కీలక అంశాలు**

**22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం**


**ఎన్‌టీఏ పారదర్శకత, భద్రతపై తీవ్ర విమర్శలు**

**పారదర్శక విచారణ, బాధ్యులపై చర్యలు, పరీక్షల వికేంద్రీకరణ**

# మృతుల పేర్ల తొలగింపుకు రాష్ట్రవ్యాప్తంగా చేయూత పెన్షన్ సర్వే

### మే 15 నుంచి జూన్ 15 వరకు ఇంటింటి ధృవీకరణ

### సర్వే అనంతరం కొత్త లబ్ధిదారుల ఎంపిక




హైదరాబాద్, మే 14 (వార్త నిర్భయం) రాష్ట్రంలో చేయూత పెన్షన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెన్షనర్ల జాబితాలో ఉన్న మృతుల పేర్లను తొలగించి, అర్హులైన వారికి మాత్రమే పింఛన్లు అందేలా ప్రత్యేక సర్వే నిర్వహించనుంది. ఈ మేరకు మే 15 నుంచి జూన్ 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, పురపాలక కమిషనర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.కొంతకాలంగా మృతుల పేర్లపై కూడా అనధికారికంగా పింఛన్లు విడుదలవుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం, ఆర్థిక భారం తగ్గించడంతో పాటు అవినీతికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, హైదరాబాద్ నగరంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక బృందాలుగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు.సర్వే సందర్భంగా ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా పెన్షనర్ల వివరాలు నమోదు చేయబడతాయి. జీవించి ఉన్న లబ్ధిదారులను “లైవ్‌నెస్ ఆథెంటికేషన్” ద్వారా ధృవీకరించగా, మరణించిన వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేస్తారు. అనంతరం గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మృతుల జాబితాను ప్రజల ముందుంచి ఆమోదం తీసుకున్న తర్వాతే వారి పేర్లను అధికారికంగా తొలగించనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో మరో రెండు లక్షల కొత్త చేయూత పెన్షన్లకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జరుగనున్న పరిశీలన పూర్తయ్యాక ఖాళీ అయ్యే స్థానాల్లో కొత్త అర్హుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులకు ఈ ప్రక్రియ ద్వారా ప్రయోజనం కలిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ సమగ్ర ధృవీకరణ ప్రక్రియతో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగే అవకాశం ఉండగా, అక్రమాలపై కూడా నియంత్రణ సాధ్యమవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి.

### వరంగల్‌లో ఏఐవైఎఫ్ నిరసన
### నిందితుడి అరెస్ట్‌కు డిమాండ్.
### పోచమ్మైదాన్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం.
### 17 ఏళ్ల బాలికపై అత్యాచార ఘటనను ఖండించిన ఏఐవైఎఫ్.



వరంగల్ ప్రతినిధి.మే 14 (వార్త నిర్భయం) అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ పోచమ్మైదాన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు.తెలంగాణలో 17 ఏళ్ల బాలికపై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు అత్యంత ఆందోళనకరమని అన్నారు.రాజకీయ అండదండలు ఉన్నా లేకపోయినా నేరస్తులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, జగదీష్, మతీన్ కాకా, రమేష్, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు

## సమాజ హితులు ఆర్యవైశ్యులు
## మానవసేవే మాధవసేవ ఆర్యవైశ్యుల సిద్ధాంతం







సూర్యాపేట బ్యూరో మే 14 వార్త నిర్భయం

సూర్యాపేట : సమాజం మేలు కోరుకునే హితులు ఆర్యవైశ్యులని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది సుప్రీంకోర్టు అడ్వకేట్, రిటైర్డ్ జడ్జి, శ్రీ వాసవి సేవా సమితి జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాలి యాద్రి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 36 వ వార్డులో శ్రీ వాసవి సేవా సమితి నూతన జిల్లా కార్యాలయాన్ని శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మానవసేవే మాధవసేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో చూపిస్తున్న కులస్తులు ఆర్యవైశ్యులని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా ఆర్యవైశ్యుల దక్కడం ఆనందంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆర్యవైశ్యుల పాత్ర వెలకట్టలేనిది అన్నారు . నిరుపేదల కష్టాలు బాధలు చూసి చదివించే మనసు ఉన్న ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందు వరుసలో ఉన్నారన్నారు. శత్రువులంటూ లేకుండా జీవనం సాగించే ఆర్యవైశ్యులు ఎందరికో ఆదర్శం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ తమ మతం కోసం ప్రాణాలు సైతం ఇవ్వడానికి వెనకాడ బోరని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు దేవాలయాలకు తీసుకువెళ్లాలని దీని ద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయం భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటుతూ వాటిని సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కరోనా సమయంలో శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణపట్నం సంబంధించిన మందును 30 వేల కు పైగా కుటుంబాలకు అందించామని సందర్భంగా గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉంటూ ఏ చిన్న సమస్య ఉన్న పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, కే శ్రీనివాసరావు,కాంగ్రెస్ నాయకులు ఫరూక్, గౌరవ చైర్మన్ ఈగ దయాకర్ గుప్తా, జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం, గౌరవ సలహాదారులు గోపారపు రాజు, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్ ,సోమ సుమన్, తప్సి అనిల్ కుమార్, కోటా శివ, కర్నాటి కృష్ణ , బొల్లం సురేష్ ,సభ్యులు కొండ అనిల్ కుమార్, శ్రీరంగం రాము, సోమ ధనుంజయ్, మనసాని నాగేశ్వరరావు,మిట్టపల్లి రమేష్, బెలిదే శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, చందా రాజశేఖర్ , గుడిపాటి రమేష్ వెంపటి శబరినాథ్, తల్లాడ రాము,బుక్క రమేష్, బచ్చు నీరజ, తెడ్ల పల్లవి,ఉప్పల0చు కృష్ణ,మహంకాళి సోమయ్య పాల్గొన్నారు.

## 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేసేవరకు పోరాటం ఆగదు

### రంగనాథ్ మిశ్రా కమిషన్ ను వెంటనే అమలుచేయాలి
### దళిత క్రైస్తవులపట్ల అన్నీ రాజకీయ పార్టీల వైఖరి తెలపాలి
### తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్
### బిషప్ దుర్గం ప్రభాకర్
### పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్
### రెవ. డా. జలగం జేమ్స్




సూర్యాపేట బ్యూరో మే 14 వార్త నిర్భయం

సూర్యాపేట రూరల్ మండలం కేసారం , బేతెస్థ ప్రార్ధన మందిరం నందు సూర్యాపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ ఏర్పుల క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో జరిగిన దళిత క్రైస్తవ సమావేశంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు గా డిమాండ్ చేశారు.గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమిషన్ (2004)ను ఏర్పాటు చేసిందనీ మాజీ సీజేఐ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన, ఇది 2007లో దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని నివేదికను ప్రభుత్వంనకు సమర్పించారనీ దానిని వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. మరియు 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు దేశం లోని అన్నీ రాజకీయ పార్టీల వైఖరి కూడా తెలపాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమం లో రెవ. బొక్క ఏలీయా రాజు, రెవ. డా. డి. జాన్ ప్రకాష్, రెవ. పంది మార్క్,పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ ప్రేమ్ సాగర్,పిట్టల సామెల్,రెవ. సి. హెచ్. కిరణ్ కుమార్,యల్క ప్రభాకర్,మామిడి కృష్ణ, ఎన్.భాస్కర్, డి. రాజు,బాణాల సైమన్, విజయలక్ష్మి,ప్రేమ్ సాగర్, గెర్షోము, రమేష్ తదితరులు పాల్గొన్నారు

## రాచర్ల లక్ష్మి కాంతారావు మెమోరియల్ లయన్స్ విజన్ ఐ కేర్ సెంటర్ ప్రారంభం

### పాల్గొన్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మరియు ఇతర సభ్యులు





సూర్యాపేట బ్యూరో మే 14 వార్త నిర్భయం సూర్యాపేట పట్టణం లోని రద్దీగా వుండె కొత్త బస్టాండ్ సమీపంలో హీరో షోరూం ఎండి రాచర్ల కమలాకర్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన రాచర్ల లక్ష్మి కాంతారావు మెమోరియల్ నూతన విజన్ కేర్ సెంటర్ ను లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్ ప్రారంభించారు. ఇందులో ఐ కేర్, కంటి పరీక్షలు, కంటి సర్జరీ లు, డయాబెటిక్ టెస్ట్ లు , కంటి అద్దాలు నామమాత్రపు రుసుముతో ఇవ్వడం జరుగుతుందని లయన్ రాచర్ల కమలాకర్ అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల తరహా వైద్యం విజన్ కేర్ సెంటర్ నందు పేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు లభిస్తాయని చెప్పారు. ఈకార్యక్రమం లో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో లయన్స్ క్లబ్ వారి విజ్ఞప్తి మేరకు రాచర్ల కమలాకర్ ఆద్వర్యంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో అత్యాధునిక ఐ టెస్టింగ్ మెషిన్ ను ఏర్పాటు చేశారని , ఈ సెంటర్ పేదప్రజలకు చాలా ఉపయోగకరంగా వుంటుందని అన్నారు. కార్యక్రమం లో లయన్ రాచర్ల లక్ష్మి కమలాకర్ దంపతులు, ఎలక్ట్ గవర్నర్ కె వి ప్రసాద్, వైస్ గవర్నర్ కోడె సతీష్ కుమార్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వర రావు, దోసపాటి గోపాల్ మాజి ఎమ్మెల్యే, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్, ఉప్పల రాజేంద్ర ప్రసాద్ సెక్రటరీ, మీలా మహదేవ్, కక్కిరేణి చంద్రశేఖర్, బండారు రాజా, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మి ప్రసాద్, మిర్యాల సుధాకర్, రాచర్ల వెంకటేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్, పెద్దిరెడ్డి గణేష్, సవరాల సత్యనారాయణ, పోలబోయిన నర్సయ్య యాదవ్, గుండా లక్ష్మయ్య, యామా రామ్మూర్తి, హరి, భోనగిరి భాస్కర్, ఐ హాస్పిటల్ మేనేజర్ మల్లికార్జున్, డాక్టర్ హితేష్, విజన్ టెక్నిషియన్ బంగారు స్వాతి,తదితరులు పాల్గొన్నారు. రాచర్ల లక్ష్మి కమలాకర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్, వైస్ గవర్నర్ ఇతర సభ్యుల సమక్షంలో రాచర్ల లక్ష్మి కమలాకర్ కేక్ కట్ చేశారు. విచ్చేసిన సభ్యులందరూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బండి భగీరథ అరెస్ట్‌కు డిమాండ్ చేస్తూ సీపీఎం నిరసన

### అంబేద్కర్ చౌక్‌లో దిష్టిబొమ్మ దహనం
### పోక్సో కేసులో తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్.





వనపర్తి బ్యూరో, మే 14 (వార్త నిర్భయం) సీపీఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు, పోక్సో కేసు నిందితుడు బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం. పరమేశ్వర చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. జబ్బార్ మాట్లాడారు. మైనర్ బాలికపై మత్తుమందు ఇచ్చి పలుమార్లు అత్యాచారం చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథను పోక్సో కేసు నమోదై ఆరు రోజులైనా పోలీసులు అరెస్ట్ చేయలేదని విమర్శించారు. ముందస్తు బెయిల్ వచ్చే వరకు అతనిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బాధితురాలిపై తప్పుడు కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.బండి భగీరథ పరారీలో ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. మైనర్‌పై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక తల్లి పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి, పోక్సో కేసు నమోదు చేయడానికి కూడా పోలీసులు మీనమేషాలు లెక్కించారని ఆరోపించారు.పోక్సో లాంటి కఠినమైన కేసులో కూడా నిందితుడిని అరెస్ట్ చేయకుండా బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. బాధితురాలిపైనే పోలీస్ కేసు పెట్టడం దుర్మార్గమన్నారు. బండి భగీరథను మైనర్ బాలిక హనీట్రాప్ చేసిందని, డబ్బుల కోసమే ఇదంతా చేస్తోందని చెప్పడం మహిళల పట్ల వారి వైఖరిని, దిగజారుడుతనాన్ని తెలియజేస్తుందన్నారు.అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం 18వ వార్డు కౌన్సిలర్ గంధం మదన్, పట్టణ కమిటీ సభ్యులు డి. కురుమయ్య, జి. బాలస్వామి, ఏ. రమేష్, గంధం గట్టయ్య, జిల్లా కమిటీ సభ్యులు గుంటి వెంకటయ్య, రేమద్దుల సర్పంచ్ నిరంజన్, నందిమల్ల రాములు, ఉమా, డి. శ్రీనివాసులు, బి. కురుమయ్య, విజయ్ కుమార్, ఎం. మన్యం, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

### ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
### బిజెపి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన 19వ వార్డు కౌన్సిలర్ పిడమర్తి కీర్తి లవన్







సూర్యాపేట బ్యూరో మే 14 వార్త నిర్భయం

సూర్యాపేట: పట్టణ అభివృద్ధిలో కౌన్సిలర్లు పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో 19వ వార్డు కౌన్సిలర్ కీర్తి లవన్ బీజేపీ పార్టీకి రాజీనామా చేసి పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మూడు రంగుల జెండా కప్పి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ పోతు భాస్కర్ లు మూడు రంగుల కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల ప్రజాప్రతినిధు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో భారీగా గా చేరుతున్నారని చెప్పారు. జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సారథ్యంలో సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, సంక్షేమంలో జోడెదుల్లా పరుగులు పెడుతున్నాయని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో అన్ని సమస్యలను ఇప్పటికే గుర్తించామని వాటిని పరిష్కరించేందుకు జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డిల సహకారంతో భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ కీర్తి లవన్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం అధికార పార్టీతో పాటు మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సారథిలో పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరడం హర్షణీయమని, పార్టీపై నమ్మకం విశ్వాసంతో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దక్షిణ భారతదేశంలో నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటూ బలమైన ప్రతిపక్షంగా పనిచేస్తుంది అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి అంజద్ అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్లు చిలుముల సునీల్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, పోల గాని బాలు, గునగంటి హేమా సతీష్, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న, నాయకులు బొప్పని శ్రీకాంత్, 19వ వార్డు నుంచి చేరిన వారిలో నిమ్మల పురుషోత్తం, కోడి వినయ్, సతీష్, పృథ్వి, జలగం రాజు, షేక్ జావీద్, కృష్ణ, నాంపల్లి బాలు, అఖిల్, మోర అజయ్, సాయి, ఎండీ సాజిద్, కె, సందీప్, సతీష్, తదితరులు ఉన్నారు.